క్లుప్తంగా

ఆర్టీసీ బస్టాండ్లలో స్టాల్స్‌కు టెండర్లు

రామచంద్రపురం రూరల్: రామచంద్రపురం ఆర్టీసీ డిపో పరిధిలోని ద్రాక్షారామ, కె.గంగవరం, రామచంద్రపురం బస్టాండ్‌ల పరిధిలో స్టాల్స్, షాపులు, ఖాళీ స్థలాలను వ్యాపారాల నిమిత్తం పొందేందుకు ఈ నెల 27 లోగా సీల్డ్ టెండర్లు దాఖలు చేసుకోవాలని డిపో మేనేజర్ కొడమంచిలి వెంకటేశ్వర్లు గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. టెండరు దరఖాస్తులన్నీ ఆర్టీసీ డిపోల్లో లభిస్తాయన్నారు. 26వ తేదీ లోగా కార్యాలయ పనివేళల్లో టెండర్ ఫారమ్‌లు తీసుకుని 27న మధ్యాహ్నం ఒంటి గంట లోపు రాజమహేంద్రవరం డిపో కార్యాలయంలో అందజేయాలన్నారు.

దాతల చేయూత



బాధితులకు నిత్యావసర సరకులు పంపిణీ చేస్తున్న ప్రజాప్రతినిధులు

కె.గంగవరం: కోటిపల్లి మాధవ్‌నగర్‌లో అగ్ని ప్రమాద బాధిత కుటుంబానికి గురువారం దాతలు చేయూత అందించారు. పాలెపు సత్యనారాయణ పూరిల్లు పాక్షికంగా అగ్నికి ఆహుతి కావడంతో గ్రామ సర్పంచ్ పెమ్మాడి బేబిసత్తిబాబు బియ్యం, కూరగాయలు, నిత్యావసర సరకులు పంపిణీ చేశారు. ప్రభుత్వం నుంచి ఆ కుటుంబానికి నష్ట పరిహారం అందే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. గ్రామ పెద్దలు పప్పుల సాయిబాబు, మానే సాయిబాబు, మతుకుమిల్లి బాబి, పంతాడి హరిబాబు, పాలెపు శ్రీరాములు, పేసింగి రాంబాబు, నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

ముత్యాలమ్మ జాతరకు పటిష్ట ఏర్పాట్లు



ముత్యాలమ్మ అమ్మవారి ఆలయం వద్ద గరగలను ఎత్తుతున్న తొగరు మూర్తి

రామచంద్రపురం: స్థానిక వైఎస్సార్ నగర్‌లో ముత్యాలమ్మ జాతర మహోత్సవాన్ని ఈ నెల 24, 25 తేదీలలో నిర్వహించేందుకు పటిష్ట ఏర్పాట్లు చేశామని ఆలయ కమిటీ గౌరవాధ్యక్షుడు తొగరు మూర్తి తెలిపారు. ఈ మేరకు ఆలయం వద్ద గురువారం ఆయన మాట్లాడారు. ఆలయంలో అమ్మవారి పాదాల వద్ద పెన్నులు ఉంచి ప్రత్యేక పూజల అనంతరం విద్యార్థులకు పంపిణీ చేస్తామన్నారు. 24న జాతర సందర్భంగా భారీ ఊరేగింపు, 25న ఆలయం వద్ద ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకూ పరమహంస యోగానంద కంటి ఆసుపత్రి వారి సహకారంతో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తామన్నారు. అలాగే అన్నసమారాధన ఉంటుందని, భక్తులు తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు. అమ్మవారి గరగలను ఎత్తి మూర్తి జాతర మహోత్సవానికి శ్రీకారం చుట్టారు. కమిటీ సెక్రటరీ చెరుకూరి రాజు, రెడ్డి ప్రసాద్, ఆకుల వెంకటేశ్వరరావు, గణపతి, నరసింహమూర్తి, ఇళ్ల స్వామి, యానాదుల సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

మోటారు సైకిల్ బ్యాటరీ పేలి అగ్ని ప్రమాదం



ప్రమాదంలో దగ్ధమైన గది

మండపేట: చార్జింగ్ పెట్టిన ఎలక్ట్రికల్ మోటారు సైకిల్ బ్యాటరీ నుంచి మంటలు వచ్చి అగ్నిప్రమాదం సంభవించిన ఘటన స్థానిక బురగుంట చెరువు వద్ద చోటుచేసుకుంది. స్థానికులు, ఫైర్‌స్టేషన్ సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం బురగుంట చెరువు సమీపంలో నివసిస్తున్న జీవీవీ సత్యనారాయణ బుధవారం రాత్రి తన ఎలక్ట్రికల్ మోటారుసైకిల్ బ్యాటరీకి పక్క గదిలో చార్జింగ్ పెట్టి పడుకున్నారు. అర్ధరాత్రి సమయంలో బాటరీ పేలి మంటలు చెలరేగాయి. ఈ ఘటనలో గది సీలింగ్, వైరింగ్, లోపల గృహోపకరణాలు కాలిపోయి సుమారు రూ.లక్ష ఆస్తినష్టం వాటిల్లింది. అదృష్టవశాత్తు ఎవరికి ఏమీ కాలేదు. ఫైర్‌స్టేషన్ సిబ్బంది, చుట్టుపక్కల వారు మంటలను అదుపుచేశారు.

శతాధిక వృద్ధురాలి మృతి



బుద్దరాజు సీతమ్మ (ఫైల్)

ఆత్రేయపురం: మండల పరిధిలోని లొల్ల గ్రామంలో బుద్దరాజు సీతమ్మ (102) గురువారం మృతి చెందింది. ఈమెకు కుమారుడు, ఐదుగురు మనవరాళ్లు, 13 మంది ముని మనుమలు ఉన్నారు. ఈమె మృతి పట్ల పలువురు సంతాపం వ్యక్తం చేశారు.

సాగుకు పోదాం.. చలోచలో

- సకాలంలో వ్యవసాయానికి చర్యలు
- రైతుల్లో చైతన్యం నింపేందుకు సదస్సులు



కాజులూరులో ట్రాక్టర్‌తో దమ్ము పనులు



మొగలిపాలెంలో కళకళలాడుతున్న నారుమడి

కాజులూరు: అదును దాటితే ఏదైనా అనర్థమే.. సాగుకు ఇబ్బందికరమే.. వ్యవసాయం గాడిన పడితే ప్రతికూల పరిస్థితుల నుంచి గట్టెక్కవచ్చు.. ప్రకృతి వైపరీత్యాలను సమర్థవంతంగా ఎదుర్కొవచ్చు.. ఆరుగాలం శ్రమించి పచ్చని సిరులు పండిస్తున్న పుడమి పుత్రులు ముచ్చటగా మూడు పంటలు పండించేందుకు, పంటను ప్రకృతి వైపరీత్యాల నుంచి కాపాడేందుకు 'సాగుకు సమాయత్తం' పేరిట ప్రభుత్వం అవగాహన సదస్సులు నిర్వహిస్తుంది. ప్రస్తుతం తొలకరి సాగుకు రైతులు సిద్ధం కావాలని వ్యవసాయ సూచనలు చేస్తోంది. దీనిపై గ్రామ గ్రామాన అవగాహన సదస్సులు చేపడుతోంది. సకాలంలో సాగు చేపడితే చివరి దశలో తుపాన్ల బారిన పడకుండా తొలకరి పంట ఒడ్డుకు చేరుతుందని, దాళ్వా సాగు సమయానుకూలంగా జరిగి మూడు పంటలకు అవకాశం ఏర్పడుతుందని వివరిస్తున్నారు. రామచంద్రపురం నియోజకవర్గంలోని కాజులూరు, రామచంద్రపురం, కె.గంగవరం మండలాల్లో 67 ఎకరాల సాగు భూమి ఉంది. ఈ ఏడాది సుమారు 56 వేల ఎకరాల్లో ఖరీఫ్ సాగుకు రైతులు సిద్ధమవుతున్నట్టు అధికారుల అంచనా. ప్రస్తుతం ఈ నెల 1వ తేదీనే ప్రభుత్వం గోదావరి డెల్టా కాలువలకు సాగునీరు విడుదల చేసింది. పంట కాలువల ద్వారా దాదాపు అన్ని ప్రాంతాల్లోని పొలాలకు సాగునీరు చేరింది. గత పది రోజుల కిందటి నుంచే నియోజకవర్గంలో అక్కడక్కడా రైతులు నారుమడులు వేయడం ప్రారంభించారు. ప్రస్తుతం అధికశాతం రైతులు నారుమడుల సిద్ధం చేసుకోవడం, విత్తనాల సేకరణ తదితర పనుల్లో నిమగ్నమయ్యారు. ముందుగా నారుమడులు వేసినచోట మరో వారం, పది రోజుల్లో వరినాట్లు ప్రారంభం కానున్నాయి. జూలై మధ్యాంతరానికి నియోజకవర్గంలో పూర్తి స్థాయిలో వరినాట్లు ఊపందుకుంటాయని వ్యవసాయాధికారులు భావిస్తున్నారు. సాధ్యమైనంత తొందరగా రైతులు తొలకరి నాట్ల దశను పూర్తి చేయాలని చెబుతున్నారు.

ఆలస్యమైతే అనర్థమే..

నాట్లు ఆలస్యమైతే పంట ఆలస్యమై తెగుళ్ల బెడద ఎక్కువగా ఉంటుందని, తద్వారా తొలకరి సాగుకు ఖర్చు అధికమవుతుందని కాజులూరు మండల వ్యవసాయాధికారి వి.అశోక్ వివరించారు. కొన్నేళ్లుగా నవంబర్ నెలలో తుపాన్లు సంభవించి తొలకరి పంట చివరి దశలో తీవ్రంగా నష్టపోతుంది. జూలై మొదటి వారం నాటికి నాట్లు పూర్తయితే అక్టోబర్ నెలాఖరు నాటికి పంట చేతికొచ్చి నవంబర్‌లో వచ్చే తుపాన్ల తాకిడికి గురికాకుండా ఉంటుంది. నవంబరు చివరి వారం లేదా డిసెంబర్ మొదటివారం నాటికి దాళ్వా సాగు ప్రారంభిస్తే మార్చి నెలాఖరు నాటికి దాళ్వా మాసూళ్లు పూర్తవుతాయి. గతంలో డెల్టా ప్రాంతంలో రైతులు దాళ్వా పంట అనంతరం మూడో పంటగా పెసర, మినుము వంటి అపరాలు సాగు చేసేవారు. అపరాల పంట తక్కువ పెట్టుబడితో మంచి దిగుబడి ఇస్తుంది. ఇటీవల మే నెల వరకూ దాళ్వా సాగు సాగుతుండటంతో ఎండలు పెరిగి అపరాల పంటకు అవరోధం ఏర్పడుతుంది. మూడో పంట అపరాల సాగుకు సానుకూలత కల్పించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని వ్యవసాయ అధికారులు వివరిస్తున్నారు. దానికి అనుగుణంగా ముందుకు సాగాలని చెబుతున్నారు.

సాగుకు త్వరపడండి



సాగుకు సరైన సమయం ఇదే. రైతులు త్వరపడాలి. దీనిపై ఇప్పటికే గ్రామాల్లో 'సాగుకు సమాయత్తం' పేరిట చైతన్య సదస్సులు నిర్వహిస్తున్నాం. ఇప్పుడు నారుమడులు సిద్ధం చేసుకునే పనులు ప్రారంభిస్తే పంట చివరి నాటికి తుపాన్ల బారి నుంచి కాపాడుకోవచ్చు. రైతు భరోసా కేంద్రాల్లో అవసరమైన ఎరువులు, పురుగు మందులు అందుబాటులో ఉన్నాయి. కావాల్సిన వారు సంప్రదించవచ్చు.

–వి.అశోక్, వ్యవసాయాధికారి, కాజులూరు మండలం

శ్రీరామనామ సప్తాహ మహోత్సవం ప్రారంభం



ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో సప్తాహం ప్రారంభించిన మంత్రి వేణు

రామచంద్రపురం రూరల్: ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలోని ప్రసన్నాంజనేయస్వామి ఆలయం వద్ద స్వామి బాలభక్త సమాజం ఆధ్వర్యంలో శ్రీరామ నామ సప్తాహ మహోత్సవం ప్రారంభమైంది. దీనిని గురువారం రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ ప్రారంభించారు. వేద పండితుల వేద మంత్రోచ్ఛరణల మధ్య విఘ్నేశ్వర పూజ, కలశ స్థాపన నిర్వహించి కై రం వీరవెంకట సత్యనారాయణ (సతార్ స్వామి) నేతృత్వంలోని అయ్యప్ప భక్తి రంజని భజన గీతాలతో కార్యక్రమం జరిగింది. ఈ నెల 22 నుంచి 29వ తేదీ వరకూ సుమారు 20 భజన బృందాలు సప్తాహంలో భజనలు చేయనున్నాయి. సర్పంచ్ కె.అరుణ, వైఎస్సార్ సీపీ జిల్లా పంచాయతీరాజ్ విభాగం అధ్యక్షుడు అనిశెట్టి రామకృష్ణ, నియోజకవర్గ శెట్టిబలిజ సంఘ అధ్యక్షుడు నరాల ఏడుకొండలు, వాసంశెట్టి నారాయణమూర్తి, సాక్షి పద్మనాభం, గరగ బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

ముంపు సమస్యకు త్వరలో పరిష్కారం

మున్సిపల్ చైర్‌పర్సన్ దుర్గారాణి



స్థానికులతో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ దుర్గారాణి

మండపేట: పట్టణంలోని 27వ వార్డు మూడో వీధిలో వర్షపునీటి ముంపు సమస్య త్వరలో పరిష్కారం కానుందని మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి తెలిపారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా డ్రైనేజీ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్టు ఆమె తెలిపారు. వార్డు పర్యటనలో భాగంగా 27వ వార్డు కౌన్సిలర్ నీలం దుర్గతో కలిసి చైర్‌పర్సన్ ఆ వార్డులో గురువారం ఉదయం పర్యటించారు. ఈ సందర్భంగా ఎక్కువగా వర్షం వచ్చినప్పుడు డ్రైన్ పొంగిపోయి ముంపునీరు ఇళ్లలోకి వచ్చేస్తోందని 3వ వార్డుకు చెందిన ప్రజలు చైర్‌పర్సన్ దుర్గారాణి దృష్టికి తీసుకువచ్చారు. దీర్ఘకాలంగా ఉన్న సమస్య పరిష్కారం నిమిత్తం డ్రైన్ అభివృద్ధికి కృషి చేస్తున్నామని చైర్‌పర్సన్ తెలిపారు. పారిశుధ్యంపై స్థానికులు తెలిపిన సమస్యలు గురించి మున్సిపల్ కమిషనర్ టి.రామ్‌కుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ లావణ్యలతో మాట్లాడి పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా దుర్గారాణి మాట్లాడుతూ మెరుగైన పారిశుధ్యం లక్ష్యంగా వార్డు పర్యటనలు చేపట్టామన్నారు. పారిశుధ్యం నిర్వహణలో ఏ సమస్యలున్నా సంబంధిత వలంటీర్, శానిటేషన్ సెక్రటరీ దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కారానికి చర్యలు తీసుకుంటారని సూచించారు. షేక్, జంగమ కార్పొరేషన్ డైరెక్టర్లు షేక్ అలీఖాన్‌బాబా, మీగడ శ్రీనివాస్, కౌన్సిలర్లు శెట్టి కల్యాణి, అమలదాసు లక్ష్మి, పిల్లి శ్రీనివాస్, మారిశెట్టి సత్యనారాయణ, కోఆప్షన్ సభ్యుడు సయ్యద్ రబ్బానీ, అర్బన్ కన్వీనర్ ముమ్మిడివరపు బాపిరాజు, పార్టీ నాయకులు గోరు అన్నవరం, అధికారి శ్రీనివాస్, జొన్నపల్లి సత్తిబాబు, మొండి మురళి, చల్లా ప్రసాద్, భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

గడప గడపకూ సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ



భట్లపాలికలో వృద్ధురాలిని ఆప్యాయంగా పలుకరిస్తున్న మంత్రి చెల్లుబోయిన వేణు

కె.గంగవరం: ప్రతి గడపకూ సంక్షేమ పథకాలు అందేలా చూడాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. గురువారం భట్లపాలికలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ పథకాల గురించి వివరించారు. తొలుత వలంటీర్లు, సచివాలయ సిబ్బందితో మంత్రి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో అంతా పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ప్రతి గడపకూ వెళ్లి సంక్షేమ పథకాలను వివరించి వారి సమస్యలు తెలుసుకుని నమోదు చేసుకోవాలన్నారు. నమోదు చేసుకున్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించాలన్నారు.

తాగునీటికి రూ. 65 లక్షల మంజూరు

భట్లపాలిక శివారుతో పాటు పలు గ్రామాలకు తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు మంత్రి వేణు ఆయా శాఖల అధికారులతో మాట్లాడి రూ. 65 లక్షలు మంజూరు చేయించారు. గ్రామాల్లో నిధుల లభ్యతను బట్టి వెంటనే పనులు ప్రారంభించి ప్రతి ఇంటికీ తాగునీరు అందించే ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. దరువుపేటలో రూ. 5 లక్షలతో కమ్యూనిటీ షెడ్ నిర్మాణానికి చర్యలు చేపడుతున్నామని మంత్రి తెలిపారు. బడుగు బలహీన వర్గాల వారి సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని అన్నారు. అనంతరం గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రం, ప్రాథమిక పాఠశాలను మంత్రి సందర్శించారు. ఆహారం నాణ్యతపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఎంపీపీ పంపన నాగమణి, సర్పంచ్ యలమంచిలి పద్మావతి, జిల్లా వ్యవసాయ సలహా కమిటీ డైరెక్టర్ బత్తుల అప్పారావు, మండల మాజీ కన్వీనర్ ఓబులనేని రాజ్‌కుమార్, సొసైటీ అధ్యక్షుడు మేడిశెట్టి వెంకట రమణ, కన్వీనర్లు మోర్త శ్రీహరి, కట్టా తిరుమల పాల్గొన్నారు.

మంత్రిని కలసిన డ్రైన్స్ శాఖ ఈఈ

రామచంద్రపురం: స్థానికంగా మంత్రి క్యాంప్ కార్యాలయంలో మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణను కాకినాడ జిల్లా డ్రైన్స్ శాఖ ఈఈ కె.ఏడుకొండలు మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించి కొద్దిసేపు మాట్లాడారు.

పరిశుభ్రతతో వ్యాధులు దూరం



గొల్లపాలెం ఆదిమూలల కాలనీలో సీసీ డ్రెయిన్‌కు శంకుస్థాపన చేసిన నాయకులు

కాజులూరు: పల్లెల పరిశుభ్రతతో వ్యాధులను దూరం చేయవచ్చని వైఎస్సార్ సీపీ మండల బీసీ సెల్ కన్వీనర్ గుబ్బల ఏసురాజు, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి పోతురాజు బాబూరావు అన్నారు. గొల్లపాలెం ఆదిమూలల కాలనీలో రూ.10 లక్షలతో సీసీ డ్రెయిన్ నిర్మాణానికి గురువారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమం జగనన్న ప్రభుత్వానికి రెండు కళ్లు అని అన్నారు. కరోనా విపత్కర సమయంలోనూ సంక్షేమ పథకాలను అమలు చేసిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా రోడ్ల, డ్రైనేజీల నిర్మాణాలు, తాగునీటి వసతుల కల్పన పెద్దఎత్తున జరుగుతున్నాయని అన్నారు. రామచంద్రపురం వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ వైస్ చైర్మన్ కాకతీయ రాజు, డైరెక్టర్ ఎస్.ఈశ్వరరెడ్డి, పంచాయతీ పాలకవర్గ సభ్యులు రేఖపల్లి సత్యానందం, నాయకులు తోట కృష్ణ, వడ్డి శ్రీను, మాత నాగరాజు, సత్తి సూరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాలువ గట్ల పనులకు శ్రీకారం

తీరనున్న రైతుల వెతలు



కాలువగట్లు అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న పృథ్వీరాజ్

మండపేట: జెడ్.మేడపాడులో దీర్ఘకాలంగా రైతులను పట్టి పీడిస్తున్న కాలువగట్లు అభివృద్ధి పనులు మొదలయ్యాయి. యువనేత తోట పృథ్వీరాజ్ గురువారం పార్టీ రాష్ట్ర కార్యదర్శి దూలం వెంకన్నబాబు, ఎంపీపీ వుండమట్ల శ్రీనివాస్ తదితరులతో కలిసి ప్రారంభించారు. గ్రామంలోని కాకినాడ కెనాల్, సామర్లకెనాల్ గట్లను ఆనుకుని సుమారు నాలుగు కిలోమీటర్ల పరిధిలో 700 ఎకరాల ఆయకట్టు సాగవుతోంది. ఈ గట్లు మీదుగా రైతులు పొలాలకు రాకపోకలు సాగించాలి. ఏళ్ల తరబడి అభివృద్ధి నోచుకోకపోవడం, జిగురుమట్టి కావడంతో కొద్దిపాటి చినుకులు పడితే గట్లపై రాకపోకలకు రైతులు తీవ్ర అగచాట్లు పడాల్సి వస్తోంది. వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు తోరం శ్రీనివాస్, ఎంపీటీసీ సభ్యుడు దేవు ప్రసాద్‌నాయుడు సమస్యను ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు దృష్టికి తీసుకువెళ్లగా ఆయన వెంటనే స్పందించి గ్రావెల్ రోడ్లుగా అభివృద్ధి చేసేందుకు అధికారులకు ఆదేశాలిచ్చారు. ఎమ్మెల్సీ తోట విజయవాడలో వెళ్లడంతో వర్షాలతో గట్లు అభివృద్ధి పనులకు ఆటంకం కలుగకుండా యువనేత పృథ్వీరాజ్ భూమిపూజ చేసి ప్రారంభించారు. రైతు ప్రయోజనాల దృష్ట్యా త్వరితగతిన పనులు పూర్తి చేయాలని తోరం శ్రీనివాస్, ప్రసాద్‌నాయుడులకు ఆయన సూచించారు. ఎన్నో ఏళ్లుగా పట్టి పీడిస్తున్న కాలువగట్లు సమస్య ఎట్టకేలకు పరిష్కారమవుతుండడంపై స్థానిక రైతులు ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, వైఎస్సార్ సీపీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఎంపీటీసీ సభ్యుడు అన్నందేవుల కృష్ణారావు, పార్టీ నేత గారపాటి అశోక్‌కుమార్, మండల కన్వీనర్ పిల్లా వీరబాబు, జేసీఎస్ కన్వీనర్ బందెల సాయిరాం, సచివాలయ కన్వీనర్లు గెడ్డం గాంధీ, తీగిరెడ్డి మహేష్, ఆర్‌బీకే చైర్మన్ కొమ్మిశెట్టి నాగు, పార్టీ నాయకుడు అద్దంకి రమణ, అబ్బిరెడ్డి వీర్రాజు, మాదిబోయిన రమణ తదితరులు పాల్గొన్నారు.

నాడు–నేడు పనుల పరిశీలన



ద్రాక్షారామ జెడ్పీ హైస్కూల్‌లో తలుపులు, కిటికీలను పరిశీలిస్తున్న ఎంఈఓ శ్రీనివాస్

రామచంద్రపురం రూరల్: ద్రాక్షారామ జెడ్పీ హైస్కూల్‌లో చేపట్టిన రెండో దశ నాడు–నేడు పనులను ఎంఈఓ మానుపూడి శ్రీనివాస్ గురువారం పరిశీలించారు. అదనపు తరగతి గదులకు వచ్చిన తలుపులు, కిటికీలను పరిశీలించారు. అనంతరం మూడో తరగతి నుంచి ఇంటర్ వరకూ ఉన్న ద్రాక్షారామ జెడ్పీ హైస్కూల్, హైస్కూల్ ప్లస్‌లను సమర్థవంతంగా నిర్వహించాలని నూతనంగా హెచ్‌ఎంగా వచ్చిన గుణ్ణం రాజేశ్వరికి ఎంఈఓ సూచించారు.

క్రీడా పాఠశాలలో ప్రవేశానికి పరీక్షలు

రామచంద్రపురం రూరల్: కడపలోని డాక్టర్ వైఎస్సార్ క్రీడా పాఠశాలలో 4, 5వ తరగతుల్లో ప్రవేశాలకు ఎంపిక పరీక్షలు శుక్రవారం ఉదయం 9 గంటలకు రామచంద్రపురం శ్రీకృత్తివెంటి పేర్రాజు పంతులు క్రీడా ప్రాంగణంలో నిర్వహించనున్నట్లు ఎంఈఓ మానుపూడి శ్రీనివాస్ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 4వ తరగతిలో ప్రవేశానికి 2014 ఆగస్టు 1వ తేదీ నుంచి 2015 జూలై 31వ తేదీల మధ్య జన్మించి ఉండాలన్నారు. 5వ తరగతిలో ప్రవేశానికి 2013 ఆగస్టు 31వ తేదీకి 2014 జూలై 31వ తేదీల మధ్య జన్మించి ఉండాలన్నారు. అర్హత కలిగిన వారికి ఎత్తు, బరువు చూసి, 30 మీటర్లు, 800 మీటర్ల పరుగు పందేలు, లాంగ్ జంప్ పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ఇందులో ఎంపికైన విద్యార్థులను జిల్లాస్థాయి ఎంపికలకు పంపుతారన్నారు. ఆసక్తి, అర్హత కలిగిన విద్యార్థులు వయసు ధ్రువీకరణ పత్రాలను పీడీ అప్పాజీకి అందజేయాలని అన్నారు.

మహిళా డెయిరీ అసోసియేషన్ సెంటర్ ప్రారంభం



నూతనంగా ఏర్పాటైన డెయిరీ అసోసియేషన్

రాయవరం: కురకాళ్లపల్లి సచివాలయంలో గురువారం మహిళా డెయిరీ అసోసియేషన్ సెంటర్‌ను ప్రారంభించారు. సర్పంచ్ పిల్లి శారద అధ్యక్షతన జరిగిన సమావేశంలో 47 మంది మహిళా రైతులు పాల్గొన్నారు. సదరు సమావేశంలో మహిళా డెయిరీ అసోసియేషన్‌కు 11 మంది సభ్యులను ఎన్నుకున్నారు. చీఫ్ ప్రమోటర్‌గా యాండ్రపు లక్ష్మి, ప్రమోటర్‌గా దొమ్మేటి సత్యవతి, సెక్రటరీగా కురుపూడి వరలక్ష్మి ఎన్నికయ్యారు. కార్యక్రమంలో ఎంపీడీవో కొవ్వూరి నరేంద్రరెడ్డి, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ ఎ.నాగశ్రావణి, పంచాయతీ విస్తరణాధికారి కరుణాకర్, రూట్ ఆఫీసర్ బి.రత్నకుమార్, ఉప సర్పంచ్ పితాని ప్రసాద్, వైఎస్సార్‌సీపీ నేతలు పిల్లి ప్రసాద్, రాయుడు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రహదారి, డ్రైనేజీ నిర్మాణాలకు భూమిపూజ

రాయవరం: వి.సావరంలో నూతనంగా నిర్మించనున్న రహదారి, డ్రైనేజ్ నిర్మాణ పనులకు జెడ్పీటీసీ నల్లమిల్లి మంగతాయారు, ఎంపీపీ నౌడు వెంకటరమణ గురువారం భూమిపూజ చేశారు. గ్రామంలో మండల పరిషత్ నిధులు రూ.5 లక్షలు, జెడ్పీ నిధులు రూ.2 లక్షలతో రహదారి, డ్రైనేజీలను నిర్మించనున్నారు. ఈ పనులకు జెడ్పీటీసీ, ఎంపీపీ భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కాకి కృష్ణవేణి, ఉప సర్పంచ్ వెలగల సత్యనారాయణరెడ్డి, ఎంపీటీసీ మేడిశెట్టి నాగమణి, సొసైటీ అధ్యక్షులు సిరికి కృష్ణారావు, వైఎస్సార్‌సీపీ గ్రామ శాఖ అధ్యక్షుడు గుత్తుల సత్యనారాయణ, నాయకులు కాకి కోటేశ్వరరావు, మేడిశెట్టి శ్రీను, సత్తి సత్తిబాబు, మండ హరినాధరెడ్డి, గుడాల శ్రీనివాసరావు, చిర్ల సత్యనారాయణరెడ్డి, గొలుగూరి రామారెడ్డి, పడాల కమలారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సింగర్స్ క్లబ్ ప్రారంభం

సఖినేటిపల్లి: రామేశ్వరంలో గురువారం సంగీత దర్శకుడు సింధు కె.ప్రసాద్ ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన సింగర్స్ క్లబ్, రైటర్స్ క్లబ్‌ను శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ చైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్ ప్రారంభించారు. దీనికి సంబంధించిన బ్రోచర్‌ను ఆయన విడుదల చేశారు. ప్రతాప్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రతిభ ఉన్న కళాకారులకు ఈ క్లబ్ తగిన తోడ్పాటు ఇస్తుందన్నారు.

మహిళలకు సుస్థిర ఆదాయం



యనమదలలో మహిళా డెయిరీ సభ్యులతో ప్రజాప్రతినిధులు

రామచంద్రపురం రూరల్: హసన్‌బాద, యనమదల గ్రామాల్లో పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో గురువారం అమూల్ సహకారంతో మహిళా పాల డెయిరీ ఏర్పాటుకు సహకార సంఘాలను 11 మంది మహిళా సభ్యులతో ఏర్పాటు చేశారు. ఆయా గ్రామాల సర్పంచులు నాగిరెడ్డి సతీష్‌రావు, పంపన వీరవెంకటరమణ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళా రైతులకు స్థిరమైన ఆదాయం సమకూరేలా అన్ని గ్రామాల్లో జగనన్న పాలవెల్లువ పథకం ద్వారా అమూల్ డెయిరీలు ఏర్పాటు చేస్తున్నారన్నారు. ఎంపీడీఓ ఎస్.షెలత్‌రాజు, పశు వైద్యాధికారులు మేడిశెట్టి కృష్ణార్జున, డాక్టర్ జి.విజయదుర్గ, జగనన్న పాలవెల్లువ రూట్ ఇన్‌చార్జి జవహర్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ



చంద్రరావు చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న అనపర్తి ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి

రాయవరం: పితృ వియోగంతో బాధపడుతున్న మండపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సిరిపురపు శ్రీనివాసరావును అనపర్తి ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి గురువారం పరామర్శించారు. శ్రీనివాసరావు తండ్రి చంద్రరావు ఈ నెల 18న మృతి చెందిన విషయం పాఠకులకు తెలిసిందే. శ్రీనివాసరావును ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి పరామర్శించి, సానుభూతి వ్యక్తం చేశారు. జెడ్పీటీసీ నల్లమిల్లి మంగతాయారు, ఎంపీపీ నౌడు వెంకటరమణ, సర్పంచ్‌లు చంద్రమళ్ల రామకృష్ణ, మల్లిడి సూరారెడ్డి, పసలపూడి గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ చింతా సుబ్బారెడ్డి, ఉప సర్పంచ్ పోతంశెట్టి సాయిరామ్మోహన్‌రెడ్డి, సొసైటీ అధ్యక్షుడు సత్తి నాగిరెడ్డి(రాజా), ఎంపీటీసీ పీపీ, వైఎస్సార్ సీపీ నేతలు ఆర్‌వీవీ సత్యనారాయణచౌదరి, నల్లమిల్లి వెంకటరెడ్డి(చినకాపు), మంతెన అచ్యుతరామరాజు, తాడి రామచంద్రారెడ్డి, తమలంపూడి గంగాధరరెడ్డి, పడాల కమలారెడ్డి తదితరులు శ్రీనివాసరావును పరామర్శించారు.

ఫ్యామిలీ డాక్టర్‌తో మెరుగైన వైద్యం

మామిడికుదురు: ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయని నగరం పీహెచ్‌సీ వైద్యాధికారి కె.స్వర్ణలత అన్నారు. గురువారం పెదపట్నంలంక కనకదుర్గమ్మ ఆలయం సమీపంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. పలువురు రోగులకు ఆమె వైద్య పరీక్షలు చేశారు. వారికి వైద్య సలహాలు, సూచనలు అందించి మందులు ఇచ్చారు. దీర్ఘకాలిక సమస్యలతో బాధపడుతున్న వారి ఇంటికి వెళ్లి వైద్య సహాయం అందించారు. హెచ్‌వీ కె.నిర్మల, ఏఎన్‌ఎం పి.నాగమణి, ఎంఎల్‌హెచ్‌పీ పి.నాగదుర్గ పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి చర్యలు

కొత్తపేట: విద్యుత్ సమస్యల సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు ఏపీఈపీడీసీఎల్ విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార న్యాయస్థానం (సీజీఆర్ఎఫ్) చైర్‌పర్సన్, రిటైర్డ్ జడ్జి డాక్టర్ బి.సత్యనారాయణ తెలిపారు. గురువారం ఆయన స్థానిక విద్యుత్ సబ్ డివిజన్ కార్యాలయంలో చైర్‌పర్సన్ సత్యనారాయణ, సభ్యుడు డాక్టర్ ఆర్.సురేంద్ర కుమార్ విద్యుత్ గ్రీవెన్స్ సెల్ నిర్వహించారు. పలువురు వినియోగదారుల నుంచి అర్జీలు స్వీకరించారు. జేఈ బీవీవీఎస్ఎస్ సతీష్ తదితరులు పాల్గొన్నారు.